క్లుప్తంగా...

‘చలో హైదరాబాద్’ను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న రవిచంద్రన్

ఘట్‌కేసర్: మున్సిపల్ కార్మికులు చేపట్టనున్న ‘చలో హైదరాబాద్’ ధర్నాను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవిచంద్రన్ అన్నారు. పట్టణంలో ఆదివారం నిర్వహించిన సంఘం సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుడూ.. పారిశుద్ధ్య కార్మికులకు 12వ పీఆర్‌సీ అమలు చేయాలని, రూ.24వేల కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు స్వామి, జయచంద్రలు మాట్లాడుతూ.. ఫిబ్రవరి 3న నగరంలోని ఇందిరా పార్కు వద్ద నిర్వహించ తలపెట్టిన చలో హైదరాబాద్ మున్సిపల్ కార్మికుల ధర్నాలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి ఈశ్వర్, మహేంద్ర, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు

పోచారం: పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడ రాష్ట్రీయ విద్యా కేంద్రంలో భారతీయ మజ్దూర్ సంఘ్(బీఎంఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి అధ్యక్షతన, జిల్లా ప్రధాన కార్యదర్శి ధనంజయగౌడ్ ఆధ్వర్యంలో జరిగిన యువ కార్యకర్తల శిక్షణా తరగతులు ఆదివారం ముగిశాయి. తెలంగాణ జిల్లాల నుంచి యువ కార్యకర్తలు శిక్షణ పొందారు. బీఎంఎస్ జాతీయ నాయకులు మల్లేశ్, చెన్నకేశవ్, సుబ్బారావు, భాస్కర్ శర్మ, బాల్‌రెడ్డి, రవిశంకర్ అసంఘటిత కార్మికుల సమస్యలు, రైల్వే కార్మికులు, ప్రభుత్వ, ప్రైవేటు రంగంలోని కార్మికులు, మహిళ కార్యకర్తల సమస్యలు, బీఎంఎస్ యూనియన్ బలోపేతంపై దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రవిరాజు వర్మ, రాంమోహన్, రమేశ్, రాము, బీఎంఎస్ యువ కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రికెట్ మైదానం ప్రారంభం



సరదాగా క్రికెట్ ఆడుతున్న మంత్రి

కీసర: చీర్యాల గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేసిన పారడైస్ క్రికెట్ క్రీడా మైదానంను ఆదివారం మంత్రి చామకూర మల్లారెడ్డి ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో శివారు ప్రాంతాల్లో క్రికెట్ మైదానాలు ఎక్కువ సంఖ్యలో ప్రారంభమవుతున్నాయని, క్రికెట్ క్రీడపై ఆసక్తి ఉన్న యువత, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బెస్త వెంకటేష్, సర్పంచ్ ధర్మేందర్, మండల పార్టీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, బర్లపాటి జయరాం తదితరులు పాల్గొన్నారు.

విద్యతో పాటు క్రీడల్లోనూ ప్రోత్సహించాలి



క్రీడా దినోత్సవంను ప్రారంభిస్తున్న అన్వితారెడ్డి

ఘట్‌కేసర్: విద్యతో పాటు క్రీడల్లో విద్యార్థులనూ ప్రోత్సహించాలని ఎవరెస్ట్ అధిరోహించిన భారత తొలి మహిళ అన్వితారెడ్డి అన్నారు. చౌదరిగూడ రోటర్‌డ్యామ్ ఇంటర్నేషనల్ స్కూల్లో ఆదివారం నిర్వహించిన క్రీడా దినోత్సవానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై క్రీడలతో సమాజంలో ఒక ప్రత్యేక గుర్తింపు లభిస్తోందన్నారు. ప్రిన్సిపాల్ రూపారెడ్డి మాట్లాడుతూ.. తమ విద్యార్థులకు రన్నింగ్, రిలే, సైకిల్, హర్డిల్స్ రేస్‌లతో పాటు గెట్ రెడీ టూ ది స్కూల్ తదితర అంశాల్లో పోటీలు నిర్వహించారు. స్కేటింగ్, రోప్ స్కిప్పింగ్, కరాటే, డ్రిల్ విన్యాసాలు, డ్యాన్స్ అలరించగా విజేతలకు బహుమతులు అందజేశారు. రోటర్ డ్యామ్ స్కూల్ డైరెక్టర్ శ్వేతారెడ్డి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాలు ఏర్పాటు చేయాలని మంత్రికి వినతి



పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డులో మహిళా మండలి భవనం, ఎస్సీ, ఎస్టీ కమ్యూనిటీ హాలు నిర్మించాలని కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డికి రాజీవ్ గృహకల్ప కాలనీవాసులు ఆదివారం వినతిపత్రం అందజేశారు. కౌన్సిలర్ బాలగోని వెంకటేశ్ గౌడ్ ఆధ్వర్యంలో మహిళలతో పాటు వార్డు ప్రజలు మంత్రిని కలిసి స్థానిక సమస్యలపై చర్చించారు. కమ్యూనిటీ హాలు నిర్మాణం కోసం ఇంజినీరింగ్ విభాగం అధికారులు సర్వే చేసిన ప్రభుత్వ స్థలంలో అక్రమంగా భవన నిర్మాణ కార్మిక సంఘ కార్యాలయం నిర్మిస్తున్నారని చెప్పారు. ఈ నిర్మాణంపై మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో కూల్చివేశారన్నారు. అయినప్పటికీ కూల్చివేసిన చోటే పునర్నిర్మాణం చేపట్టారని తెలిపారు. ప్రజాప్రయోజనాల కోసం వినియోగించాల్సిన స్థలాన్ని మేస్త్రీ సంఘ నాయకులు కబ్జా చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా ఆ నిర్మాణాన్ని తొలగించి 10వ వార్డు ప్రజల కోసం కమ్యూనిటీ హాలు కట్టించాలని విజ్ఞప్తి చేశారు. అందుకు మంత్రి స్పందించి నిర్మాణాన్ని తొలగించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు.

మూడేళ్ల పాలనలో..

నువ్వేంతంటే.. నువ్వేంతంటూనే..!

పురపాలికల్లో పాలకవర్గం కొలువుదీరి మూడేళ్లయినా అభివృద్ధి అంతంతే..

- అధ్వానంగా ప్రధాన, అంతర్గత రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ
- రూ.లక్షల్లో పన్నులు.. ఆర్థిక సంఘం.. పట్టణ ప్రగతి నిధులొచ్చినా.. ముందుకు సాగని అభివృద్ధి
- పట్టించుకోని అధికార గణం
- పట్టనట్లుగా పాలకవర్గం
- అక్రమ వసూళ్లు.. అంతర్గత విభేధాలతోనే సరి



సాక్షి,మేడ్చల్ జిల్లా: పురసారధులకు రాజకీయాలపై ఉన్న మక్కువ.. పట్టణ ప్రగతిపై లేదు. దీంతో మున్సిపాలిటీలు, నగర పాలక సంస్థల్లో అభివృద్ధి అంతంత మాత్రంగానే ఉంది. పురపాలికల్లో పాలకవర్గం కొలువుదీరి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా గ్రేటర్ శివారు నగరాలు, టౌణాల్లోని ప్రజల మౌలిక సదుపాయాలను పరిశీలిస్తే.. ఒకడుగు ముందుకు.. రెండడుగులు వెనక్కి అన్న చందంగా ఉంది. ప్రజల నుంచి ముక్కు పిండి పన్నుల వసూలు చేయడంపై పెడుతున్న శ్రద్ధ.. సమస్యల పరిష్కారంలో చూపడం లేదని తెలుస్తోంది. విలీన గ్రామాలు, పట్టణాలతో కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ప్రధాన రోడ్లతో సహా అంతర్గత రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో చిన్న పాటి వర్షాలకే.. రోడ్లన్నీ చిత్తడిగా మారుతున్నాయి. ఎడతేరిపి లేకుండా వర్షాలు కురుస్తే.. లోతట్టు ప్రాంతాలు, మురికి వాడలు జలమయంగా కావడంతో పాటు ప్రజలు నడవలేని స్థితికి చేరుతుండటంతో వారికి తిప్పలు తప్పడం లేదు.

శివారు ప్రాంతాల్లో సమస్యలు...

శివారుల్లోని పెద్ద నగర పాలక సంస్థగా చెప్పుకునే.. బోడుప్పల్‌లో 1.50 లక్షల జనాభాతో 162 కాలనీలు ఉండగా, వివిధ పన్నుల ద్వారా ఏటా రూ.60 కోట్ల ఆదాయం వస్తోంది. ప్రజలు మాత్రం అంతర్గత రోడ్లు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం, కాలుష్యం బారిన పడి చెరువు నీటి దుర్వాసన, నీటి సరఫరా పైప్‌లైన్ల లీకేజీలు తదితర సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. కార్పొరేషన్‌లో 230.2 కిలో మీటర్ల మేర డ్రైనేజీలు ఉండగా, ఇందులో కచ్చ డ్రైనేజీలు 35 కిలో మీటర్లు, వరద నీటి డ్రైనేజీలు ఏడు కిలోమీటర్ల వరకు ఉన్నాయి. 346.30 కిలోమీటర్ల రోడ్లు ఉండగా, ఇందులో మట్టి రోడ్లు 36.5 కిలో మీటర్ల వరకు ఉన్నాయి.

పీర్జాదిగూడలో...

మరో నగర పాలక సంస్థగా ఆవిర్భవించిన పీర్జాదిగూడలో లక్షకు పైగా జనాభాతో 80 కాలనీలు ఉండగా, ఏటా పన్నుల ద్వారా ఏటా రూ.30 కోట్ల ఆదాయం కార్పొరేషన్‌కు సమకూరినా.. ప్రజలు మాత్రం పలు సమస్యలతో బాధపడుతున్నారు. మున్సిపల్ కార్పొరేషన్‌లో 215 కిలో మీటర్ల డ్రైనేజీలు ఉండగా, ఇందులో కచ్చ డ్రైనేజీలు 32 కిలో మీటర్లు, 240 కిలో మీటర్ల రోడ్లు ఉండగా, ఇందులో మట్టి రోడ్లు 9 కిలో మీటర్ల వరకు ఉన్నాయి. ఈ పట్టణాల్లో ఎడతేరి లేకుండా వర్షాలు కురుస్తే చాలు.. రోడ్లలన్నీ నరకానికి నకళ్లుగా.. వరద, మురికి నీటితో ప్రజలను తీవ్ర ఇబ్బంది పాలుజేస్తున్నాయి. అతి పెద్ద జనాభా కలిగిన జవహర్ నగర్ నగరపాలక సంస్థలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు ఇంతా.. అంతా కాదు. ఈ మూడు నగర పాలక సంస్థలకు మాత్రమే సమస్యలు పరిమితం కాలేదు. ఇలాంటి అధ్వాన్న పరిస్థితులను ఎదుర్కొంటున్న పుర పాలక సంఘాలు నగర శివారు పరిధిలో మరో 3 నగర పాలక సంస్థలు, 23 మున్సిపాలిటీల్లో కూడా నెలకొని ఉండటంతో ఇక్కడి ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

పాలకుల మధ్య బేదాభి ప్రాయాలు...

పురసారథుల పదవీ కాలం మూడేళ్లు పూర్తి కావడంతో పలు మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థల్లో పాలకుల మధ్య బేదాభిప్రాయాలు నెలకొన్నాయి. ఈ సందర్భంగా పాలక వర్గంలో అసంతృప్తులు అవిశ్వాస తీర్మానానికి సిద్ధమయ్యారు. తాజాగా శనివారం జిల్లా కలెక్టర్‌కు జవహర్‌నగర్ నగరపాలక సంస్థకు చెందిన 20 మంది కార్పొరేటర్లు మేయర్ కావ్యకు అవిశ్వాసంపై నోటీసు ఇవ్వగా, మేడ్చల్‌లో కౌన్సిల్ సభ్యులు చైర్మన్ మార్పుపై రాజీనామాకు సిద్ధపడుతూ.. జిల్లా మంత్రి మల్లారెడ్డికి ఈ నెల 30 వరకు డెట్‌లైన్ విధించారు.

శివారుల్లో పట్టణాలివే...

నగర శివారుల్లో బోడుప్పల్, పీర్జాదిగూడ, నిజాంపేట్, జవహర్‌నగర్ బడంగ్‌పేట్, మీర్‌పేట్, బండ్లగూడ నగర పాలక సంస్థలు ఉండగా, దమ్మాయిగూడ, నాగారం, పోచారం, ఘట్కేసర్, గుండ్లపోచంపల్లి, తూముకుంట, కొంపల్లి, దుండిగల్, మేడ్చల్, పెద్ద అంబర్‌పేట్, తుక్కుగూడ, ఇబ్రహీంపట్నం, జల్‌పల్లి, షాద్‌నగర్, శంషాబాద్, శంకర్‌పల్లి, తుర్కయంజాల్, మణికొండ, నార్సింగ్, ఆదిభట్ల, ఆమనగల్లు, కొత్తూరు మున్సిపాలిటీలు ఉన్నాయి. ఈ పట్టణాల్లో ముక్కు పిండి ఏటా వివిధ పన్నుల రూపేణా రూ.343 కోట్లు వసూలు చేస్తున్నా.. పురపాలికలు ప్రజలకు మాత్రం సేవలు అందించటంలో విఫలమవుతున్నారన్న విమర్శలను ఎదుర్కొంటున్నారు.

కోట్లల్లో పన్నులు.. ఇతర వనరులు

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 13 పురపాలక సంఘాల నుంచి పన్నుల ద్వారా రూ.175 కోట్లు వస్తుండగా.. రంగారెడ్డి జిల్లాలో 16 పురపాలక సంఘాల నుంచి రూ.168 కోట్లు వసూలవుతున్నాయి. 15వ ఆర్థిక సంఘం ద్వారా కూడా ప్రతి నెల ఒక్కో పురపాలక సంఘానికి రూ.3 లక్షల నుంచి రూ.21 లక్షల నిధులు విడుదలవుతున్నాయి. పట్టణ ప్రగతిలోనూ పురపాలక సంఘాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోంది. ఈ నిధులన్నింటిని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులకు వెచ్చించాల్సి ఉన్నప్పటికీ పట్టించుకోకపోవడంతో.. అభివృద్ధి అంతంత మాత్రంగా సాగుతోంది.

రాజకీయాలు.. అంతర్గత విభేదాలు..

పురపాలికల్లో అభివృద్ధిపై శ్రద్ధ చూపని పాలక వర్గం సభ్యులు మూడేళ్ల కాలంలో అంతర్గత వివాదాలు, అందినకాడికి దండుకోవడంపై ఎక్కువ దృష్టి సారించినట్లు ఆరోపణలు ఉన్నాయి. తమ డివిజన్/వార్డు పరిధిలో బహుళ అంతస్తుల భవనాలు, అపార్టుమెంట్లు, లేఅవుట్లపై ప్రత్యేక దృష్టితో అనుచరులు, టౌన్‌ప్లానింగ్ విభాగంలోని కొంత మంది సిబ్బందితో ప్రతీ దానికి ఒక రేటు ఫిక్స్ చేసి వసూలు చేపట్టినట్లు విమర్శలు ఉన్నాయి. పురపాలికల్లో అభివృద్ధి కార్యక్రమాలపై కాకుండా అక్రమ వసూళ్లపై పోటాపోటీగా వ్యవహరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. అలాగే మెజారిటీ పురపాలికల్లో పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు కుమ్మక్కై అక్రమ వసూళ్లకు తెర లేపడంతో పాటు నియోజకవర్గం స్థాయి ముఖ్య ప్రజాప్రతినిధికి కూడా నెల నెలా అక్రమ వసూళ్లలో వాటాను అందిస్తున్నట్లు తెలుస్తోంది.

రోడ్డు పనులకు నిధులు మంజూరు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయ గ్రామం నుంచి మేడ్చల్ మండలం గౌడవెల్లి గ్రామం వరకు బీటీ రోడ్డు పనులు చేపట్టేందుకు రూ.2.7 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఇందుకు సహకరించిన మంత్రి మల్లారెడ్డికి, మేడ్చల్ ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి, జెడ్పీటీసీ శైలజలకు గౌడవెల్లి గ్రామస్తుడు, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు దయానంద్‌యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. టెండర్లు సైతం పూర్తయ్యాయని, త్వరలో పనులు చేపట్టనున్నట్లు ఆయన చెప్పారు.

ఖేలో ఇండియా పోటీలకు విద్యార్థిని ఎంపిక

శామీర్‌పేట్: శామీర్‌పేట్‌లో కొనసాగుతున్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల జగద్గిరిగుట్ట శాఖ విద్యార్థిని వర్షితను ఖేలో ఇండియా యూత్ గేమ్స్ బాక్సింగ్ పోటీలకు ఎంపికైంది. ఫిబ్రవరి 6 వరకు మధ్యప్రదేశ్‌లో జరగనున్న ఖేలో ఇండియా యూత్ గేమ్ బాక్సింగ్ పోటీల్లో వర్షిత పాల్గొననుంది. ఈ మేరకు ఓఎస్‌డీ భాను ప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ ఇష్రత్, పీడీ అరుందతిలు వర్షితను అభినందించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



లబ్ధిదారుడికి చెక్కు అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మేడ్చల్‌రూరల్: మండలంలోని ఘనాపూర్ గ్రామానికి చెందిన పార్వతయ్యకు రూ.32 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కు ఆదివారం మండల బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి సుదర్శన్ అందజేశారు. బీఆర్ఎస్ నాయకులతో కలిసి లబ్ధిదారుడి ఇంటికి వెళ్లి చెక్కు అందజేసి పరామర్శించారు. కార్యక్రమంలో గ్రామాధ్యక్షుడు మహేశ్, నాయకులు మోహన్‌బాబు, లక్ష్మీనారాయణ, వెంకటేశ్, రమేశ్, బాలేశ్ తదితరులు పాల్గొన్నారు.

‘రాజ్యాంగం కారణంగానే స్వేచ్ఛగా జీవిస్తున్నాం’



కీసరలో నిర్వహించిన జ్ఞానమాలలో జలాల్‌పురం సుధాకర్‌రెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న కౌన్సిలర్ హేమఐలయ్య

కీసర: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం ద్వారానే మనం నేడు సమాజంలో స్వేచ్ఛగా జీవిస్తున్నామని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు జలాల్‌పురం సుధాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం కీసర మండల కేంద్రంలో అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో 52వ వారం నిర్వహించిన ‘జ్ఞానమాల’లో ఆయన పాల్గొని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైస్ ఎంపీపీ జె.సత్తిరెడ్డి, అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు రవీందర్, ప్రధానకార్యదర్శి దాయర శ్రీనివాస్, నాయకులు చినింగని బాల్‌రాజ్, శీలం మల్లేష్, తుడుం శ్రీనివాస్, యాదగిరి, మహేష్, గణేష్, మంగ, కావేరి, రవి, రాకేష్, శ్రీనివాస్, సాయిలు, ప్రశాంత్, బంటు, అరవింద్, కిరణ్, మధుయాదవ్ పాల్గొన్నారు.

పోచారం మున్సిపాలిటీలో...

ఘట్‌కేసర్: ప్రపంచ స్థాయి మేధావి అంబేడ్కర్ అని పోచారం మున్సిపల్ కౌన్సిలర్ హేమఐలయ్య అన్నారు. జ్ఞాన మాల కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి ఆదివారం ఆమె పూలమాల వేసి మాట్లాడారు.అరుణ్‌కుమార్, ఐలయ్య, రాందాస్, శ్రీనివాస్, రాజేశ్‌కుమార్, నర్సింహ, నర్సింగ్‌రావు, వెంకటేశ్వరరావు, మల్లేశ్, భగవాన్, భరత్‌కుమార్, వికాస్, ఉపేందర్, కల్యాణ్, శివకుమార్, సంతోశ్, మధుసూదన్, సత్యనారాయణ, మైసయ్య, నవీన్, సంజయ్, అనుశ్ పాల్గొన్నారు.

రూ.1.32 కోట్ల నాబార్డు నిధులతో కీసర మండల పరిషత్ కార్యాలయ సమీపంలో కొత్తగా నిర్మించిన గోదాంను ప్రారంభించేందుకు ఈ నెల 2న విచ్చేయాలని మంత్రి మల్లారెడ్డిని ఆహ్వానిస్తున్న కీసర రైతు సహకర సొసైటీ అధ్యక్షుడు రామిడి ప్రభాకర్‌రెడ్డి, చిత్రంలో వైస్ చైర్మన్ పన్నాల బుచ్చిరెడ్డి, డైరెక్టర్లు కాంసాని మల్లారెడ్డి . – కీసర



దొంగలొచ్చారంటూ పోలీసులపై గిరిజనుల దాడి

దోపిడీ కేసులో నిందితుడిని వెతికేందుకు వెల్లగా ఘటన

బొమ్మలరామారం: దోపిడీ కేసు ఛేదనలో భాగంగా ఓ అనుమానితుడిని అదుపులోకి తీసుకునేందుకు వెళ్లిన పోలీసు బృందానికి చేదు అనుభవం ఎదురైంది. మఫ్టీలో ఉన్న పోలీసులు ఓ వ్యక్తిని బలవంతంగా అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేస్తుండగా.. దొంగలొచ్చారంటూ గిరిజనులు దాడికి పాల్పడగా డీఐ(డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్), ఇద్దరు ఎస్‌ఐలు, కానిస్టేబుల్‌కు గాయాలయ్యాయి. యాదాద్రి భువనగిరి జిల్లాలోని బొమ్మలరామారం మండలం ప్యారారం గ్రామ పరిధిలోని గద్దరాళ్ల తండాలో శనివారం అర్ధరాత్రి చోటు చేసుకున్న ఈ ఘటనపై భువనగిరి ఏసీపీ వెంకట్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. ఈ నెల 23న మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా మూడు చింతలపల్లి మండలంలో ఉద్దమర్రి గ్రామంలోని వినాయక వైన్స్‌లో ముగ్గురు దుండగులు కాల్పులకు తెగబడి రూ.2 లక్షలను దోచుకొని పారిపోయారు. ఈ కేసును ఛేదించేందుకు పోలీసులు 6 బృందాలుగా ఏర్పడి గాలింపు చేపట్టారు. కేసు విచారణలో భాగంగా ఓ పోలీస్ బృందంలోని అల్వాల్ డీఐ కిరణ్‌కుమార్, మేడ్చల్ ఎస్‌ఐ సత్యనారాయణ, షామీర్‌పేట్ ఎస్‌ఐ మునేందర్, కానిస్టేబుల్ సతీష్‌లు కారులో శనివారం రాత్రి 11 గంటల తర్వాత మండల పరిధిలో గద్దరాళ్ల తండాకు మఫ్టీలో వచ్చారు. దోపిడీకి పాల్పడిన ముగ్గురిలో ఓ దుండగుడికి తండాకు చెందిన ఇటుకల వ్యాపారి భూక్యా చందునాయక్ ఆశ్రయం కల్పించినట్లు సమాచారం ఉండటంతో అతడిని అదుపులోకి తీసుకోవాలని అనుకున్నారు. ఈ క్రమంలో చందునాయక్, అతడి భార్య మంజుల ప్రతిఘటిస్తూ చోర్..చోర్ అంటూ కేకలు వేశారు. దీంతో తండాలోని గిరిజనులు మఫ్టీలో ఉన్న పోలీసులను చుట్టు ముట్టి దాడికి తెగబడ్డారు. తాము పోలీసులమని చెప్పేందుకు అల్వాల్ డీఐ కిరణ్‌కుమార్ గన్ తీస్తుండగా తీవ్ర ఆగ్రహంతో ఉన్న గిరిజనులు దాన్ని లాక్కున్నారు. గిరిజనుల దాడికి తట్టుకోలేక కానిస్టేబుల్, మరో ఎస్‌ఐ పారిపోయారు. డీఐ కిరణ్‌కుమార్‌తో పాటు మరో ఎస్‌ఐకి తీవ్ర, పారిపోయిన ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే తండాకు 40 మందికి పైగా పోలీసులు చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. అనంతరం గాయపడిన ఇద్దరిని శామీర్‌పేటలోని ఓ ఆస్పత్రికి తరలించారు.

మట్టిని తరలిస్తున్న లారీలు సీజ్

కీసర: బోగారం, బర్సిగూడ గ్రామాల్లో శనివారం అర్ధరాత్రి వేళ మట్టిని తరలిస్తున్న లారీలను ఎస్ఓటీ పోలీసులు పట్టుకొని కీసర తహసీల్దార్ గౌరివాత్సల్య ఆదేశాల మేరకు కీసర పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆరు వాహనాలను ఢీకొట్టిన పెట్రోల్ ట్యాంకర్

- డ్రైవర్‌పై కేసు నమోదు

ఘట్‌కేసర్: ఓ కారు, ఐదు ద్విచక్ర వాహనాలను ఢీకొట్టిన పెట్రోల్ ట్యాంకర్ డ్రైవర్‌పై ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. సీఐ అశోక్‌రెడ్డి వివరాల ప్రకారం.. బోగారం గ్రామానికి చెందిన సురేందర్‌రెడ్డి శనివారం రాత్రి మహేంద్ర ఎక్స్‌యూవీ 300 కారు(టీఎస్08జేఎఫ్1517)లో ఘట్‌కేసర్ నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. బస్టాండ్ సమీపంలోని బాబా ఆప్టికల్ వద్దకు రాగానే హెచ్‌పీ పెట్రోల్ ట్యాంకర్ (టీఎస్12యూఏ1845) డ్రైవర్ బంటు శ్రీనివాస్ వేగంగా, అశ్రద్ధగా ట్యాంకర్‌ను నడుపుతూ కారును ఓవర్ టేక్ చేసే క్రమంలో కారుతో పాటు మరో ఐదు ద్విచక్రవాహనాలను ఢీకొట్టాడు. దీంతో కారుతో పాటు ద్విచక్రవాహనాలు ధ్వంసమయ్యాయి. దీంతో కారు, ద్విచక్ర వాహనాల యజమానులు పీఎస్‌లో ఫిర్యాదు చేయగా పెట్రోల్ ట్యాంకర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే మాతృమూర్తి మణెమ్మకు నివాళి



మణెమ్మకు నివాళులర్పిస్తున్న మంత్రి మల్లారెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ వెంకటేశ్ చిత్రంలో శరత్‌చంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



నివాళులర్పిస్తున్న జెడ్పీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ హరివర్ధన్‌రెడ్డి

ఘట్‌కేసర్: మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి మాతృమూర్తి, జెడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి నాయనమ్మ మణెమ్మ సంవత్సరికంను ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ హరివర్ధన్‌రెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ వెంకటేశ్‌లతో కలిసి పాల్గొన్న మంత్రి మల్లారెడ్డి ప్రతాపసింగారంలోని వారి నివాసంలో మణెమ్మకు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ శివశంకర్, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ కుమార్‌ముదిరాజ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమేశ్, ఉపాధ్యక్షుడు సందీప్‌రెడ్డి, కృష్ణారెడ్డి, మాజీ సర్పంచులు బిక్షపతిగౌడ్, సంజీవగౌడ్ పాల్గొన్నారు.

అధికారం కోసం అప్పటి మందం హామీలేనా!?

ఎన్నికల సమయాల్లో వీఆర్ఏల సమస్యలు పరిష్కరిస్తామని హామీలిచ్చి, గాలికొదిలేశారు



ఘట్‌కేసర్‌లో వీఆర్ఏల సమ్మె(ఫైల్)

- వీఆర్ఏలపై ప్రభుత్వం మొసలికన్నీరు
- గతేడాది 80 రోజుల పాటు నిరవధిక సమ్మె
- న్యాయం చేయాలని వేడుకుంటున్న వీఆర్ఏలు

ఘట్‌కేసర్: గ్రామ పాలనలో రెవెన్యూ సహాయకుల (వీఆర్ఏ)ల పాత్ర ఎంతో కీలకమైనది. గ్రామంలో 24 గంటలు ప్రజలకు, అధికారులకు అందుబాటులో ఉంటారు. అత్యవసరమైతే సెలవులు, పండుగల్లో కూడా విధులు నిర్వహిస్తారు. కాని వీఆర్వో వ్యవస్థను ప్రభుత్వం రద్దు చేసిన తర్వాత వీరి ఉద్యోగ భద్రతపై ఆందోళన ఎక్కువైంది. నెలకు ఇస్తున్న రూ.10,500ల వేతనంతో కుటుంబాలు నడవడం లేదన్న విన్నపం మేరకు సీఎం కేసీఆర్ 2020 సెప్టెంబర్ 9న అసెంబ్లీలో వీఆర్ఏలకు పే స్కేల్ ఇస్తామని హామీ ఇచ్చారు. రెండేళ్లయిన ఇవ్వకపోవడంతో 2022 జూలై 25న నిరవధిక సమ్మె చేపట్టారు. మంత్రి కేటీఆర్ కూడా ఇచ్చిన హామీని నిలబెట్టుకోకపోదంతో సమ్మెను మరింత ఉధృతం చేసి మునుగోడు ఎన్నికల్లో నామినేషన్ వేశారు. దీంతో వెంటనే స్పందించిన అప్పటి సీఎస్ సోమేశ్‌కుమార్ మునుగోడు ఎన్నికల కోడ్ ముగిసాక పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో 80 రోజుల పాటు చేపట్టిన సమ్మెను 2022 అక్టోబర్ 12న విరమించారు. మూడు నెలలైన ఇచ్చిన హామీలు నెరవేరకపోవడంతో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని సుమారు 200 మంది వీఆర్ఏలు మరో ఉద్యమానికి సిద్ధమవుతున్నారు.

న్యాయమైన డిమాండ్లివే...

పే స్కేలు, ఉద్యోగ భద్రత, ఇతర ఉద్యోగులకు వర్తించే సదుపాయాలు, పీఎఫ్, ఈఎస్ఐ, బీమా, పెన్షన్ అందజేయాలని, 55 ఏళ్లు నిండిన వారికి పదోన్నతి కల్పించాలని, వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగ అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. వీఆర్ఏల్లో ఎక్కువ మంది దళితులు, గిరిజనులు, బీసీలే ఉండగా వారంతా ఇళ్లు గడవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీఎం కేసీఆర్, మాజీ సీఎస్ సోమేశ్‌కుమార్, మంత్రి కేటీఆర్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని, లేని పక్షంలో మరో మారు సమ్మెకు దిగుతామని హెచ్చరిస్తున్నారు.

“ హామీ ఇవ్వడంతోనే సమ్మె విరమించాం



మునుగోడు ఎన్నికల కోడ్ తర్వాత సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతోనే తాము గతేడాది 80 రోజుల పాటు చేపట్టిన సమ్మెను విరమించాం. పేదలైన వీఆర్ఏలను దృష్టిలో ఉంచుకుని మాకిచ్చిన హామీలు నెరవేర్చండి.

– కృష్ణ, అధ్యక్షుడు, వీఆర్ఏల సంఘం, ఘట్‌కేసర్

“ జూనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించాలి



వీఆర్‌ఓ వ్యవస్థ రద్దుకు ముందు ఐదేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న వీఆర్ఏలు వీఆర్వోలుగా పదోన్నతి పొందారు. ప్రస్తుతం వీఆర్వో వ్యవస్థ లేక పోవడంతో పదోన్నతి ఆగిపోయింది. వీఆర్వోలకు జూనియర్ అసిస్టెంట్లుగా సర్దుబాటు చేసిన విధంగానే వీఆర్ఏలను కూడా జూనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించాలి.

– రమాకాంత్, ఈసీ మెంబర్, స్టేట్ డైరెక్టర్ రిక్రూట్‌మెంట్ వీఆర్ఏ అసోసియేషన్

ఉద్యోగాలు పొందడం కాదు.. సృష్టించే స్థాయికి ఎదగాలి

‘సామాజిక వ్యాపారం’ అంశంపై బాల వికాస ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి మహాసభ



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఆంధ్రు జింగ్రాస్, శౌరిరెడ్డి



మాట్లాడుతున్న జింగ్రాస్

కీసర: యువత ఉద్యోగాలు పొందడం కాదు.. అవి సృష్టించే స్థాయికి ఎదగాలని బాల వికాస స్వచ్ఛంద సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శౌరిరెడ్డి అన్నారు. ఆదివారం రాంపల్లిదాయరలో గల బాలవికాస సాంఘిక స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ‘సామాజిక వ్యాపారాలు’ అనే అంశంపై సుమారు వెయ్యి మంది యువతతో నిర్వహించిన రాష్ట్ర స్థాయి మహాసభలో ఆయన మాట్లాడారు. ప్రపంచంలోనే అత్యధిక యువతను భారత్ కలిగి ఉందని, వ్యాపారం వైపు వెళ్లే యువత సమాజంలోని సమస్యలను తీర్చేలా నూతన ఆవిష్కరణలతో వ్యాపారాల వైపు నడుగులు వేయాలని సూచించారు. బాల వికాస ఆధ్వర్యంలో దేశంలోనే అతిపెద్ద సోషల్ ఇంక్యూబేషన్ సెంటర్‌ను స్థాపించి యువతకు సామాజిక వ్యాపారంపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. దీనిని యువత ఉపయోగించుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. గత 45 ఏళ్లుగా సేవా రంగంలో ఎన్నో రకాల వినూత్న పథకాలను కల్పిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నమూనాలను అందిస్తూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తోందన్నారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, కర్నాటక, ఛత్తీస్‌ఘడ్, ఒడిశా, తమిళనాడు రాష్ట్రాల్లో 7వేలకు పైగా గ్రామాల్లో 90 లక్షల మందికి వివిధ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చిన సంస్థ బాల వికాస సంస్థ అని అన్నారు. సంస్థ వ్యవస్థాపకులు బాలతెరిసాజింగ్రాస్, ఆంధ్రు జింగ్రాస్ మాట్లాడుతూ.. యువత యుక్త వయస్సులోనే మంచి లక్షణాలతో ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లి లక్ష్యాలను సాధించాలన్నారు. అనంతరం యువతకు సుమారు రూ.10 లక్షల విలువైన బ్యాగ్స్, నోట్ బుక్స్ తదితర వస్తువులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాలవికాస అధ్యక్షుడు ఇంద్రారెడ్డి, ఉపాధ్యక్షుడు బాసాని మర్రెడ్డి, జన వికాస అధ్యక్షుడు లూర్దు మర్రెడ్డి, సోపార్ అధ్యక్షుడు ఎరిక్(కెనడా), సోపార్ (కెనడా) డైరెక్టర్ శోభారెడ్డి, డైరెక్టర్లు రాహుల్, సునితారెడ్డి, బాలవికాస మేనేజర్లు లత, ప్రతాపరెడ్డి, తిరుపతిరెడ్డి, మంజుల, శివరాం, పుష్ప, మోసెస్, సిబ్బంది పాల్గొన్నారు.